## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, డిసెంబర్ 16: ఏబీ స్విచ్ పనులు చేపడుతున్నందున మంగళవారం నగరంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాలాజీ నగర్, సూర్య నగర్, ఆర్టీసీ కాలనీ, సీతారాంపూర్, గౌడ్స్ కాలనీ, ద్వారకా నగర్, హనుమాన్ నగర్, రేకుర్తి చౌరస్తా, మెహర్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## రేపటి నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరా

కార్పొరేషన్, డిసెంబర్ 16: నగరంలోని అన్ని డివిజన్లలోనూ ఈ నెల 18 నుంచి 23 వరకు రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా సాగుతుందని నగరపాలక సంస్థ ఈఈ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిల్టర్ బెడ్‌లో మిషన్ భగీరథ మరమ్మతుల దృష్ట్యా నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. నగర ప్రజలు గమనించి, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

## నేడు రెవెన్యూ గార్డెన్‌లో విశ్రాంత ఉద్యోగుల సభ

కలెక్టరేట్, డిసెంబర్ 16 : జాతీయ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో భారీ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు పెండ్యాల కేశవ రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొని, మార్గదర్శనం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి శాఖ విశ్రాంత ఉద్యోగుల నుంచి ఇద్దరు పెన్షనర్లను సన్మానించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులంతా విధిగా హాజరై, సభ విజయవంతం చేయాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## 19న సీఎం కప్ పారా స్పోర్ట్స్

కొత్తపల్లి, డిసెంబర్ 16 : ఈ నెల 19న సీఎం కప్ పారా స్పోర్ట్స్ పోటీల ఎంపికలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖాధికారి వి. శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అథ్లెటిక్స్, స్టాండింగ్ వాలీబాల్, క్రికెట్, వీల్ చైర్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, సైక్లింగ్ సీనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని, పాల్గొనేవారు ఈ నెల 19న డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో తగు పత్రాలతో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

## మానకొండూర్ పీహెచ్‌సీ సందర్శన

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 16: వంద రోజుల నిక్షయ్ శివిర్ ప్రత్యేక టీబీ కార్యక్రమంలో భాగంగా సోమవారం వీహెచ్‌వో కన్సల్టెన్సీ ప్రత్యేకాధికారులు డాక్టర్ విష్ణు, డాక్టర్ బ్లెస్సీ మానకొండూర్ పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు సౌమ్య, మహ్మద్ సల్మాన్, సీహెచ్‌వో రాజూనాయక్, హెల్త్ సూపర్‌వైజర్ జుబేర్, ఎస్‌టీఎస్ సదయ్య, సిబ్బంది ఉన్నారు.

## బావుపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం

శిబిరంలో పరీక్షలు చేస్తున్న అపోలో వైద్యురాలు

కొత్తపల్లి, డిసెంబర్ 16 : మండలంలోని బావుపేట గ్రామంలో సోమవారం అపోలో రీచ్ హాస్పిటల్ కరీంనగర్ ఆధ్వర్యంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 150 మందికి మధుమేహం, రక్తపోటు, డాక్టర్ కన్సల్టేషన్, డైటీషియన్ సేవలు, ఫిజియోథెరపీ సేవలను అందించారు. ఈ శిబిరంలో అపోలో రీచ్ హాస్పిటల్ కరీంనగర్ పరిపాలనాధికారి డాక్టర్ నాగ సతీశ్‌కుమార్, మార్కెటింగ్ సీనియర్ మేనేజర్ సదానందం, హసన్ అలీ, సుధాకర్, హరీశ్, నర్సింగ్ సిబ్బంది, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ కరీంనగర్ ఎస్‌వో శరణ్ జీత్, హమీద్, అంకుర్ తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యుత్ ఆర్టిజెన్ కార్మికులు ధర్నాలో పాల్గొనాలి'

వీణవంక, డిసెంబర్ 16: ఈ నెల 18న తెలంగాణ విద్యుత్ ఆర్టిజెన్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ విద్యుత్ జేఏసీ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఊట్ల ప్రభుదాస్ ప్రకటనలో కోరారు. ఆర్టిజెన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని ఇందిరాపార్క్ వద్ద చేపడుతున్న ధర్నాలో విద్యుత్ ఆర్టిజెన్ కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## పీఆర్‌టీయూ టీజీ కొత్తపల్లి మండల కార్యవర్గం

కొత్తపల్లి, డిసెంబర్ 16 : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ కొత్తపల్లి మండలాధ్యక్షుడిగా రాచమల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బూట్ల కనకయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డి నియామక ఉత్తర్వులు జారీచేశారు. బోనాలపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న రాచమల్ల శ్రీనివాస్ కొత్తపల్లి మండలాధ్యక్షుడిగా ఎన్నికకాగా, ఎలగందుల హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బూట్ల కనకయ్య ప్రధాన కార్యదర్శిగా నియామకం కాగా, వీరికి పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాతూరి రాజ్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరహరి రాంరెడ్డి, పబ్బ జ్యోతిలక్ష్మి, కోమటి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మండల ఆనందం, చిందం రమేశ్, జిల్లా ఉపాధ్యక్షురాలు గుండేటి పుష్పలత, గంట సుజాత, మండలంలోని ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

## వన్ హాస్పిటల్‌పై ఫిర్యాదు

విద్యానగర్, డిసెంబర్ 16: గుండె నొప్పితో బాధపడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స పొందేందుకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వన్ హాస్పిటల్‌లో చేరిన ఓ వ్యక్తికి ఆరోగ్యశ్రీ సేవలు వర్తించవని, క్యాష్‌లో చేరాలని వైద్యులు, సిబ్బంది తెలపడంతో సంబంధిత రోగి కుటుంబ సభ్యులు ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. వారి కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం రాములపల్లికి చెందిన పత్తెం రాజయ్య ఆదివారం సాయంత్రం 4 గంటలకు గుండె నొప్పితో బాధపడుతూ కరీంనగర్‌లోని వన్ హాస్పిటల్ లో చేరాడు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి ఇది ఎమర్జెన్సీ కేసు అని, వెంటనే శస్త్ర చికిత్స చేయాలని తెలిపారు. ఆరోగ్యశ్రీ వర్తించదని రూ.3.50 లక్షలు చెల్లిస్తే వైద్యం అందిస్తామని, లేకుంటే రోగిని షిఫ్ట్ చేయాలని సూచించారు. పేద కుటుంబం కావడంతో రాజయ్యకు ఇదే హాస్పిటల్ సమీపంలోని ఓ వైద్యశాలలో ఆరోగ్యశ్రీలో చికిత్స చేయిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పేరుకే ఆరోగ్యశ్రీ అని బోర్డు పెట్టుకుంటూ పేదలను వైద్యం పేరుతో దోచుకుంటున్నారని, ఇలాంటి హాస్పిటల్స్‌పై చర్య తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

రాంనగర్, డిసెంబర్ 16: కరీంనగర్ మండలం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలం ఆరేపల్లికి చెందిన కోనేరు రవి (22)చొప్పదండిలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం యథావిధిగా చొప్పదండి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా, వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రవికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు సమీపంలోని ప్రతిమ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రవి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

## చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 16: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కార్మికులతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి రవీందర్‌కు మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల సమస్యలపై ఎన్ని సార్లు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఎన్నికల ముందు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని వాగ్దానాలు చేసి, తీరా అధికారంలోకి రాగానే వాటిని విస్మరించారని ఆరోపించారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాలో ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ నాయకులు సదయ్య, శంకర్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

# బీసీల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 16: బీసీల ఉద్యమానికి, బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తెలిపారు. రాబోయే పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని కోరుతూ.. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. టప్రా జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ అధ్యక్షతన జరిగిన ఈ నిరాహార దీక్షకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకుంటే ప్రజలు ఊరుకోరన్నారు. బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి తప్పకుండా పెంచాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మార్కెట్ కమిటీలకు కూడా రిజర్వేషన్లు కల్పించి ముందుకు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించేంత వరకు బీసీలు చేసే ఉద్యమానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు నిస్తుందని వెల్లడించారు. కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేయకుండా వెంటనే రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. జక్కని సంజయ్ మాట్లాడుతూ.. బీసీ కులగణన తాను గతంలో చేసిన ఆమరణ నిరాహార దీక్షా ఫలితమేనన్నారు. ఎంత అణచివేయాలని చూసినా ఉద్యమాన్ని ఆపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం జీవీ రామకృష్ణారావు సంజయ్‌కుమార్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, హుజూరాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్, బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ కొలిపాక శ్రీనివాస్, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ సొల్లు బాబు, బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్, ఆలేటి రవీందర్, కట్కూరి రాజేందర్, న్యాయవాది ముక్కెర రాజు, కొత్తూరి రమేశ్, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఇమ్రాన్, కొండ్ర నరేశ్, బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ సభ్యులు సందెల వెంకన్న, ఇప్పకాయల సాగర్, కుడికాల భాస్కర్, మధుసూదన్ రాజ్, కుమార్ యాదవ్, కుమార్ గౌడ్, పూలే ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

- సీఎం కప్ 2024 జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవంలో కలెక్టర్ పమేలా సత్పతి

పోటీలకు హాజరైన క్రీడాకారులతో కలెక్టర్, తదితరులు

కొత్తపల్లి, డిసెంబర్ 16 : జిల్లా క్రీడాకారులు సీఎం కప్ పోటీలను సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో సోమవారం సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందు ఆమె జ్యోతి ప్రజల చేసి, ఒలింపిక్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడాజ్యోతిని వెలిగించి, బెలూన్లను గాలిలోకి వదిలి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా జట్లు అద్వితీయ ప్రతిభ చూపి, చాంపియన్‌గా ఎదిగి జిల్లా పేరును నిలపాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తున్నదని, అందులో భాగంగానే సీఎం కప్ క్రీడలను గ్రామ స్థాయి నుంచి నిర్వహిస్తున్నదని తెలిపారు. కరీంనగర్ డీవైఎస్‌వో వి. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, జూడో, బేస్ బాల్, ఆర్చరీ పోటీలు తొలి రోజున నిర్వహించగా, సుమారు 2 వేల మందికి పైగా క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో క్రీడారంగానికి కరీంనగర్ జిల్లా తలమానికంగా నిలుస్తున్నదన్నారు. సీఎం కప్ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, స్థానిక కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్ మహిపాల్, ఉపాధ్యక్షుడు టి. రమేశ్‌రెడ్డి, కోశాధికారి ఎన్ సిద్ధారెడ్డి, పేట అధ్యక్ష కార్యదర్శులు ఎ. శ్రీనివాస్, ఎండీ యూనిస్ పాషా, ఎస్ సారయ్య, ఎ. శంకరయ్య, ఎస్. సారయ్య, పలు క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, మేనేజర్లు, మండల కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

నందయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, డిసెంబర్ 16 : కురిక్యాల మాజీ ఎంపీటీసీ అలువోజి నందయ్య రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, సోమవారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, అధికారుల నిర్లక్ష్యంతో గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించేవారు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నందయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. స్థానిక ఎస్సై నరేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, చౌరస్తా వద్ద ట్రాఫిక్ నియంత్రణకు రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు. రెండు రోజుల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని ఎస్ఐ తెలిపారని పేర్కొన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్ రావు, మాజీ సర్పంచులు వేముల దామోదర్, పంజాల ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ద్యావ మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి బాటలో సొసైటీ

వీణవంక సహకార సంఘ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

వీణవంక, డిసెంబర్ 16: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యుల సహకారంతో సొసైటీ అభివృద్ధి బాటలో ముందుకు నడుస్తున్నదని చైర్మన్ మావురపు విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో సోమవారం సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో ప్రకాశ్‌రెడ్డి మార్చి 1, 2024 నుంచి ఆగస్టు 31, 2024 వరకు జరిగిన లావాదేవీలు, లాభనష్టాలను సభాముఖంగా చదివి వినిపించారు. కాగా, రైతు రుణమాఫీ రూ.10 కోట్లు చేయాల్సి ఉండగా కేవలం రూ.4 కోట్లు మాత్రమే చేసి కాంగ్రెస్ సర్కారు రైతులను నిరాశపరిచిందని, పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని రైతు కామిడి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. 2018 నుంచి 2024 వరకు 15 సీజన్లలో వచ్చిన పాడి కమిషన్, గతంలో పోయిన గన్నీ బ్యాగ్స్ వివరాలను కూడా సభ్యులకు తెలపాలని రైతు రఘునాథరెడ్డి కోరారు. అనంతరం చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో జరిగిన అవకతవకల గురించి ఉన్నతాధికారులకు తెలిపామని, ఐదేళ్లుగా సంఘ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. సంఘ భవనం, గోదాంల నిర్మాణాలు పూర్తయ్యాయని, వాటిని త్వరలోనే ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గాజుల మేరీ, డైరెక్టర్లు మల్లయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, కామిడి కావ్య-శ్రీనివాస్‌రెడ్డి, సమ్మిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాములు, తిరుమల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వైన్స్ సమీపంలో ఇటుక బట్టీ కూలీ మృతి

రాంనగర్, డిసెంబర్ 16: కరీంనగర్ మండలం ముగ్దుంపూర్ వైన్స్ సమీపంలో ఇటుక బట్టీ కూలి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన భగవాన్ జనకర్ (40) వెంగమంబ ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఇటుక బట్టీ నుంచి బయటికి వెళ్లి సోమవారం ఉదయం వైన్స్ సమీపంలో చనిపోయి ఉన్నాడు. వైన్స్‌లో పనిచేసే వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు రూరల్ పోలీసులు అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. భగవాన్ జనకర్ మద్యం మత్తులో మృతి చెంది ఉంటాడని అతడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

## నిర్ణీత సమయానికి ముందే సిలబస్ పూర్తి చేయాలి

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 16: విద్యార్థులకు నిర్ణీత సమయానికి ముందే సిలబస్ పూర్తి చేసి, రివిజన్ ప్రారంభించాలని స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (వరంగల్) సత్యనారాయణ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల (బాలురు), శ్రీనివాస్‌నగర్‌లోని కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మానకొండూర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారా.. అని ఆరా తీశారు. రాబోయే పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కేజీబీవీని సందర్శించిన ఆయన, విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాల మెనూ పరిశీలించారు. దాని ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సమ్మెలో పాల్గొంటున్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మండల విద్యాధికారి మధుసూదనాచారిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కలెక్టరేట్, డిసెంబర్ 16 : జిల్లాలో రెండురోజులుగా కొనసాగుతున్న గ్రూప్-2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. 56 పరీక్ష కేంద్రాల్లో 13,273 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొదటిరోజు 13,273 మంది, రెండో రోజు ఉదయం 12,930, మధ్యాహ్నం 12,922 మంది పరీక్షలు రాశారు. పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జడ్పీ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాలు సోమవారం వేకువజామున భారీ పోలీసు బందోబస్తు మధ్య రూట్‌ల వారీగా పరీక్ష కేంద్రాలకు తరలించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి పవన్‌కుమార్, డీసీపీ లక్ష్మీనారాయణతో పాటు ఇతర అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తెరిచి, ప్రశ్నపత్రాల బాక్సులు కేంద్రాలకు చేరవేశారు. అనంతరం అదనపు కలెక్టర్ నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్లు వరలక్ష్మి, సతీశ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వెలిచాల జగపతిరావుపై గ్రూప్ 2లో ప్రశ్నలు

జగపతి రావు

కలెక్టరేట్, డిసెంబర్ 16 : జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, మలిదశ తెలంగాణ ఉద్యమ నేత వెలిచాల జగపతి రావు పేరు మీద గ్రూప్ 2లో రెండు ప్రశ్నలు వచ్చాయి. నాలుగో పేపర్‌లో 52వ ప్రశ్నగా ఎవరి ఆధ్వర్యంలో 'తెలంగాణ శాసన సభ్యుల ఫోరం' ఏర్పడిందనే ప్రశ్న అడిగారు. తెలంగాణ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 1992లో వెలిచాల జగపతిరావు కన్వీనర్‌గా, జానారెడ్డి చైర్మన్‌గా తెలంగాణ శాసన సభ్యుల ఫోరాన్ని ఏర్పాటు చేసి అన్ని పార్టీలకు చెందిన 92 మంది ఎమ్మెల్యేల సంతకాలతో అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావుకు వినతిపత్రం సమర్పించారు. అలాగే 55వ ప్రశ్నగా 'వెలిచాల జగపతి రావుకు సంబంధించి కింది వ్యాఖ్యలను పరిగణించండి.' అనే ప్రశ్న ఇచ్చారు. 1989లో ఆయన కరీంనగర్‌లో తెలంగాణపై మూడు రోజుల సదస్సు నిర్వహించడం, దుశర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన జలసాధన సమితి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయనపై గ్రూప్-2లో రెండు ప్రశ్నలు రావడం విశేషం.

## వల్భాపూర్ గ్రామంలో స్కూటీ దగ్ధం

వీణవంక, డిసెంబర్ 16: వల్భాపూర్ గ్రామ బస్టాండ్ ఆవరణలో ఆదివారం రాత్రి ఓ స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. వల్భాపూర్ గ్రామంలో టీఎస్ 03ఈజడ్9913 నంబర్ గల స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారని, అది కూడా ఎవరిదో తెలియదని గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి అశోక్ ఫిర్యాదు చేయగా, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

తిమ్మాపూర్, డిసెంబర్16: రామకృష్ణకాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కాలానుగుణంగా నేరాల స్వభావం మారుతున్నదని చెప్పారు. అలాగే, పలు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది మహేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చొప్పదండి నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి

సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, డిసెంబర్ 16: చొప్పదండి నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేలా చూడాలని కోరుతూ హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గంగాధరతో పాటు, చుట్టుపక్కల మండలాల విద్యార్థుల సౌకర్యం కోసం మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి తరగతులు ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

## మాజీ సర్పంచుల అరెస్ట్

ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

తిమ్మాపూర్, డిసెంబర్ 16: మండలంలోని మాజీ సర్పంచులను ఎల్ఎండీ పోలీసులు స్టేషన్‌కు తరలించి అదుపులోకి తీసుకున్నారు. సోమవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారనే అనుమానంతో పలువురు మాజీ సర్పంచులను మధ్యాహ్నం వరకు స్టేషన్‌లోనే ఉంచుకుని అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ప్రభుత్వ తీరుపై మాజీ సర్పంచులు విమర్శలు గుప్పించారు. పెండింగ్ బిల్లులు ఇప్పించకుండా అరెస్టులు చేస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నదన్నారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచులు మేడి అంజయ్య, మీసాల అంజయ్య, రెడ్డి త్రివేణీతిరుపతిరెడ్డి, మల్లెత్తుల అంజయ్య, వడ్లూరి శంకర్ తదితరులున్నారు.

## ఆర్టీసీ ఆర్ఎంను సత్కరించిన టీఎంయూ నాయకులు

ఆర్ఎం బీ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎంయూ నాయకులు

తెలంగాణచౌక్, డిసెంబర్16: ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బీ రాజును సోమవారం తెలంగాణ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కార్యదర్శి ఎంపీ రెడ్డి, నాయకులు జీ మనోహర్, పీ రవీందర్, ఏవీఆర్ రెడ్డి బస్టాండ్ ఆవరణలోని ఆర్ఎం కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ నాయకులు ఎంఆర్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్, ఈఆర్ రెడ్డి, అహ్మద్, శివప్రసాద్ ఉన్నారు.

## 18న ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ పర్యటన

జగిత్యాల రూరల్, డిసెంబర్ 16: ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డా. శమీం అక్తర్ ఈనెల 18న కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయానికి రానున్నారని జగిత్యాల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కమిషన్ చైర్మన్ షెడ్యూల్డ్ కులాల ప్రతినిధుల నుంచి షెడ్యూల్డ్ ఉప కులాల వర్గీకరణపై వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే, బహిరంగ చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

## ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి

తెలంగాణచౌక్, డిసెంబర్16: తిమ్మాపూర్ మండల కేంద్రంలో కార్మికుల చికిత్స కోసం ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నం లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్మిక శాఖ కార్యాలయంలో ఆన్‌లైన్ సర్వీసు పని చేయకపోవడంతో కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. మూడు నెలలుగా ఆన్‌లైన్ సేవలు పని చేయకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరు చేసిన లేబర్ కార్డుల మీద ఆంధ్రప్రదేశ్ పేరు ఉన్నందునా పది లక్షల కార్డులను పోర్టల్ నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ అడ్డాల వద్ద కూలీల కోసం షెడ్లు నిర్మాణం చేయడంతో పాటు అందులో మౌలిక వసతులు కల్పించాలని, ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి ఇక్కడి కూలి రేట్ల కన్నా తక్కువకు పని చేయిస్తూ స్థానిక కూలీల ఉపాధిని దెబ్బతీస్తున్న భవన నిర్మాణ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చెరువు మట్టికి అనుమతులు ఇవ్వొద్దు

శంకరపట్నం, డిసెంబర్ 16: చెరువు మట్టి వెలికితీతకు అనుమతులు ఇవ్వొద్దని కేశవపట్నం గ్రామస్తులు అధికారులకు సూచించారు. కేశవపట్నం పెద్ద చెరువులో మట్టి వెలికితీతకు ఓ ఇటుక బట్టీల వ్యాపారి అనుమతుల కోరుతూ పంచాయతీ కార్యాలయ అధికారులకు దరఖాస్తు చేసుకోగా, సోమవారం కేశవపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. అయితే గ్రామసభలో గ్రామస్తులు తమ చెరువులోని మట్టి వెలికితీసేందుకు అంగీకరించలేదు. ఇష్టారీతిన మట్టి తరలిస్తుండడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోతున్నదన్నారు. అధికారులు ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, గ్రామస్తులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

శంకరపట్నం, డిసెంబర్ 16: తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీవో కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, కార్మిక సంఘాల నేతృత్వంలో మంగళవారం ఇందిరా పార్కు వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు మండలం నుంచి 200 మంది కార్మికులు వెళ్తున్నట్లు తెలిపారు. ధర్నాకు అనుమతి కోరుతూ ఎంపీడీవోకు దరఖాస్తు ఇచ్చినట్లు వెల్లడించారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ మల్లేశం, సభ్యులు సారయ్య, సమ్మయ్య, జనార్దన్, కృష్ణ, రవి, ఎల్లయ్య, రమేశ్, వెంకటేశ్, స్వరూప, భవాని తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్, డిసెంబర్ 16: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మంగళవారం ఉద్యోగ, కార్మిక సంఘాల నేతృత్వంలో జరుగనున్న ధర్నాకు వెళ్లేందుకు అనుమతించాలని మండలంలోని పంచాయతీ కార్మికులు ఎంపీడీవో విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. విధుల్లో పాల్గొనమని చెప్పారు. కార్యక్రమంలో జీపీ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు బుడిగె అంజయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం

ముకరంపుర, డిసెంబర్16: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్-621 కరీంనగర్ రూరల్, టౌన్ డివిజన్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. కరీంనగర్ టౌన్ డివిజన్ జనరల్ సెక్రటరీగా ఎం. జితేందర్, అధ్యక్షుడిగా ఎం. రవి, ఆర్గనైజర్ సెక్రటరీగా మహేశ్, కరీంనగర్ రూరల్ డివిజన్ జనరల్ సెక్రటరీగా జాడి తిరుపతి, ప్రెసిడెంట్‌గా ఇల్లందుల రత్నం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.